15లోగా పంచాయతీ ఎన్నికల షెడ్యూల్

- కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా ఉండాలి
- ఖమ్మంపర్యటనలో పొంగులేటి

ఖమ్మం, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): త్వరలో గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లా వైరా మండలంలోని విప్పలమడకలో ఆయన తనను కలిసిన నేతలతో మాట్లాడారు. ఈ నెల 15లోగా ఎన్నికల నోటిఫికేషన్ రానున్నదని తెలిపారు. ఇందుకు కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికలపై ఇప్పటివరకు జోరుగా సాగుతున్న ఊహాగానాలకు మంత్రి వ్యాఖ్యలు ఊతమిచ్చినట్లయింది. 10లోగా నోటిఫికేషన్ ఇచ్చి 15న షెడ్యూల్ ప్రకటిస్తారనే ప్రచారం జరుగుతున్నది. పంచాయతీ ఎన్నికలు మార్చి మొదటి వారంలో జరిగే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.

సర్వేపై కాంగ్రెస్ అబద్ధాలు

- సమగ్ర సర్వే 50% కూడా పూర్తికాలే
- 98 శాతమని ఎట్లా చెప్పకొంటరు
- ప్రత్యేక డ్రైవ్ పెట్టి సర్వే పూర్తిచేయాలి
- సర్వేలో ఆస్తుల విషయాలెందుకు?
- సీఎం, మంత్రులు ప్రకటించారా?
- రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభవరణ కృష్ణమోహన్‌రావు

బీసీ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న వకుళాభరణం. చిత్రంలో ఐక్య వేదిక ప్రతినిధులు

ఖైరతాబాద్, ఫిబ్రవరి 2: సమగ్ర కులగణన సర్వేపై కాంగ్రెస్ సర్కారు అబద్ధాలు వల్లెవేస్తున్నదని, 50 శాతం కూడా పూర్తికాకుండా.. 98 శాతం పూర్తయినట్టు చెప్పడం విడ్డూరమని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు తెలిపారు. తక్షణమే 15 రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ పెట్టి వంద శాతం కులగణన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. బీసీ సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి డాక్టర్ కృష్ణమోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ వర్గాలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలతో కూడిన మ్యానిఫెస్టో తమకు పవిత్రమైన గ్రంథం లాంటిదని తెలిపారు. బీసీలకు అనేక హామీలిచ్చారని కానీ, వాటిలో ఒక్క హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. రాష్ట్రంలో పాలన గాడి తప్పిందని, పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు రావడం లేదని ఆరోపించారు. రాష్ట్రంలో నియంతృత్వ పోకడలతో పాలన సాగుతుందని విమర్శించారు. ప్రజలందరూ ఏడుస్తుంటే ప్రజాపాలన అని చెబుతుండటం హాస్యాస్పదమని చెప్పారు. సమగ్ర సర్వే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగంతో పాటు వారి స్థితిగతులు అంచనా వేయడానికి దోహదపడాలని కానీ, అప్పులు, ఆస్తుల గురించి అడగటం ఏమిటని నిలదీశారు. సమగ్ర సర్వేలో ముఖ్యమంత్రి, మంత్రులు వారి ఆస్తులు ప్రకటించారా? అని ప్రశ్నించారు. ఆస్తులను సాకుగా చూపి పేదలకు ఆరోగ్యశ్రీ, రైతుబంధును కట్ చేస్తారా? అని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు గత తీర్పులను సాకుగా చూపించి స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు మొండిచెయ్యి చూపించే అవకాశం ఉందని, ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రిప్యూ పిటిషన్ దాఖలు చేసి, కుల సర్వే గణాంకాలతో వాదనలు వినిపించాలని సూచించారు. సంచార జాతులకు ప్రత్యేకమైన రిజర్వేషన్లు అమలు చేస్తామని హామీ ఇచ్చి మర్చిపోయారని గుర్తుచేశారు. బీసీ కమిషన్ ఆ దిశగా ప్రయత్నం చేస్తుందా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఓబీసీ మోర్చా డాక్టర్ అధ్యక్షుడు ఆనంద్ గౌడ్, బీసీ సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంఘాలు, జాగృతి నాయకులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

కవితతో బీసీ సంఘాల భేటీ

కుల గణన సర్వే నివేదికపై చర్చ

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితతో బీసీ సంఘాలు, జాగృతి నాయకులు ఆదివారం ఆమె నివాసంలో సమావేశమయ్యారు. రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ క్యాబినెట్ సబ్‌కమిటీకి అందజేసిన కులగణన సర్వేలోని వివరాలపై చర్చించారు. సబ్ కమిటీ చైర్మన్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించిన గణాంకాలపై అధ్యయనం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పించడంలో ఎదురయ్యే ఇబ్బందులు, సాధ్యాసాధ్యాలపై చర్చించారు.

జనగణన ఇంకెప్పుడు?

దేశవ్యాప్తంగా జనగణనను ఎప్పుడు చేపడతారని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జనగణనను కేంద్రం విస్మరించిందని ఎక్స్ వేదికగా విమర్శించారు. జనాభా లెక్కలు లేకుండా ప్రగతి ఎలా సాధ్యం? దేశ సామాజిక, ఆర్థిక పరిస్థితి ఎలా తెలుస్తుంది? అని నిలదీశారు. జనగణన లేకుంటే వృద్ధికి ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. ప్రగతిశీల విధానాలకు జనాభా లెక్కలు తప్పనిసరి అని, జనగణనపై కేంద్రం తక్షణమే ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

రేపు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

- బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణపై ఒక్కరోజు చర్చ
- 15 నుంచి బడ్జెట్ సమావేశాలు?
- 17న రాష్ట్ర బడ్జెట్‌కు అవకాశం
- ఒకట్రెండు రోజులు అటు ఇటుగా పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్?

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తేతెలంగాణ): మంగళవారం శాసనసభ, శాసనమండలి సమావేశం కానున్నాయి. సమావేశాలు మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతాయని అసెంబ్లీ కార్యదర్శి వీ నర్సింహాచార్యులు ఆదివారం తెలిపారు. ఈ మేరకు అసెంబ్లీ స్పీకర్, మండలి చైర్మన్ ధ్రువీకరించారని ఆయన పేర్కొన్నారు.ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ప్రత్యేకంగా లేఖలు పంపినట్టు తెలిపారు. బీసీ రిజర్వేషన్లు, ఎస్సీ ఉపకులాల వర్గీకరణ తదితర అంశాలపై నిర్వహించనున్న ఈ ప్రత్యేక సమావేశాలను ఒక్క రోజులోనే ముగించనున్నారు.

17న రాష్ట్ర బడ్జెట్?

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలను ఈ నెల 15 నుంచి నిర్వహించే అవకాశం ఉన్నట్టు తెలిసింది. బడ్జెట్ సమావేశాల తొలిరోజున గవర్నర్ ప్రసంగం ఏర్పాటు చేయనున్నట్టు సమాచారం. అనంతరం 17న రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉన్నట్టు తెలిసింది. అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఒకట్రెండు రోజులపాటు సమావేశాలు నిర్వహించి, సభను వాయిదా వేస్తారని, పద్దులపై చర్చ, ద్రవ్య వినిమయ బిల్లులపై చర్చ వంటి వాటిని మార్చి రెండో వారంలో చేపడతారని తెలిసింది. బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత, ద్రవ్య వినిమయ బిల్లును ఆమోదించే మధ్యకాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తుందని చెప్తున్నారు. రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా ఇదే నెలలో పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ నెల 15లోగా పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో బడ్జెట్‌కు ఒక రోజు ముందుగాని, వెనుక గాని పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉన్నదని భావిస్తున్నారు.

42% కోటా ఇయ్యకుంటే రణరంగమే

- స్థానిక ఎన్నికల్లో బీసీల వాటా ఇవ్వాల్సిందే
- లేకుంటే రాష్ట్ర ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదు
- సుప్రీంకోర్టులో వాదించాలి
- చట్ట సభల్లో బీసీ రిజర్వేషన్ బిల్లు పెట్టాలి: ఆర్ కృష్ణయ్య
- వరంగల్‌లో బీసీ రాజకీయ రణభేరి బహిరంగసభ

మాట్లాడుతున్న ఆర్ కృష్ణయ్య

వరంగల్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీసీల వాటాను అమలు చేయకపోతే రాష్ట్రం రణరంగమవుతుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. వరంగల్ నగరంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన 'బీసీ రాజకీయ రణభేరి' బహిరంగసభలో ఆర్ కృష్ణయ్య ప్రసంగించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ కచ్చితంగా అమలు చేసేందుకు వీలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు లేకుండా రాజ్యాంగాన్ని మార్చాలని, సుప్రీంకోర్టును ఒప్పించాలని అన్నారు. రాష్ట్రంలో బీసీ బంధు పథకాన్ని అమలు చేసి ప్రతి కుటుంబానికి రూ.20 లక్షల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోరాటాలతోనే బీసీలకు చదువు, ఉద్యోగాల్లో వాటా దక్కిందని, ఇదేమార్గంలో రాజకీయ వాటాను దక్కించుకోవాలని చెప్పారు. కులాల వారీగా కాకుండా బీసీలంతా ఒక్కటిగా ఉంటేనే రాజ్యాధికారం సాధ్యమవుతుందని చెప్పారు. అధిక జనాభా ఉన్న బీసీ వర్గం నుంచి రాష్ట్రంలో ఇప్పటికీ ఒక్క ముఖ్యమంత్రి కాలేకపోయారని, సమర్థత ఉన్నా బీసీ అయిన కారణంగానే మన వర్గాలకు ఈ పదవి దక్కడంలేదని అన్నారు. ప్రధాని, ముఖ్యమంత్రి, మంత్రులు బీసీలు అయితేనే ఈ వర్గం వారికి న్యాయం జరుగుతుందని చెప్పారు. బీసీల రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో పెట్టేవరకు పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు.

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వద్దు : విల్సన్

బీసీలకు న్యాయపరమైన వాటా ఇవ్వకుండా ఈడబ్ల్యూఎస్ పేరుతో రెండు,మూడు శాతం ఉన్న వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం సరికాదని డీఎంకే రాజ్యసభ సభ్యుడు విల్సన్ అన్నారు. తమిళనాడులో ఇప్పటి వరకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను అమలు చేయలేదని, ఈ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. తమిళనాడులో బీసీలకు 69 శాతం రిజర్వేషన్ ఇస్తున్నామని చెప్పారు. ఢిల్లీలో కేంద్ర ప్రభుత్వానికి బీసీ బలం చూపించాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ సభలో గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం, బీపీ మండల్ మనుమడు సూరజ్‌మండల్, ఎమ్మెల్సీ అభ్యర్థులు సంగంరెడ్డి సుందర్‌రాజ్‌యాదవ్, పూల రవీందర్, బీసీ ఇంటలెక్చువల్ ఫోరం చైర్మన్ చిరంజీవులు, కార్యదర్శులు కూరపాటి రమేశ్, కుమార్‌యాదవ్, అశోక్‌కుమార్, పులి రజినీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్, తమిళనాడు ఎంపీ విల్సన్‌తో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఓబీసీ రిజర్వేషన్ల కోసం ఉద్యమం

- జనగణనతోపాటు కులగణన చేపట్టాలి
- బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- బీఆర్ఎస్ మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్
- సూరజ్ మండల్, జాతీయ నేతలతో భేటీ

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తేతెలంగాణ): ఓబీసీ రిజర్వేషన్ల అమలు కోసం దేశవ్యాప్త ఉద్యమానికి సిద్ధం కావాలని ఓబీసీలకు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత వీ శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా జనగణనతోపాటు కులగణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం బీసీలకు రిజర్వేషన్లు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హైదరాబాద్ శంషాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఆదివారం బీపీ మండల్ మనుమడు సూరజ్ మండల్, జాతీయ ఓబీసీ సంఘం నేత, తమిళనాడు ఎంపీ విల్సన్, ఆలిండియా ఓబీసీ స్టూడెంట్స్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు కిరణ్‌తో శ్రీనివాస్‌గౌడ్ భేటీ అయ్యారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో బీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారు చర్చించారు. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడారు. బీసీలకు ప్రైవేట్ రంగంలో ప్రత్యేక కోటా కేటాయించాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఓబీసీ మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని కోరారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42% రిజర్వేషన్లు కల్పించాలని స్పష్టం చేశారు.

బీసీలు 46.25 శాతమే!

మొదటిపేజీ తరువాయి...

సర్వే నివేదికపై సబ్‌కమిటీ కో చైర్మన్ దామోదర రాజనర్సింహ, సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి సీతక్క సచివాలయంలో ఆదివారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్లానింగ్‌శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, రాష్ట్ర నోడల్ అధికారి అనుదీప్ దురిశెట్టి, అధికారుల బృందంతో మంత్రివర్గ ఉపసంఘం చర్చించింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి సర్వే నివేదిక వివరాలను వెల్లడించారు. 50 రోజుల్లోనే కులగణన పూర్తి చేయడం చరిత్రాత్మకమని చెప్పారు. రాష్ట్రంలో మొత్తంగా 3.70 కోట్ల మంది జనాభా ఉండగా, వారిలో 3,54,77,554 (96.9 శాతం) మందిని సర్వే చేసి వివరాలు సేకరించామని తెలిపారు. 3.1 శాతం కుటుంబాలు తమ వివరాలను వెల్లడించలేదని తెలిపారు. 1.03 లక్షల ఇండ్లు తలుపులు వేసి ఉండడం, 1.68 లక్షల కుటుంబాలు మొదట్లో పాల్గొనడానికి సంకోచించడం, 84,137 ఇండ్లు నివాసేతరంగా ఉండడం వంటి సమస్యలతో మొత్తంగా 16 లక్షల కుటుంబాల వివరాలను సేకరించలేదని వివరించారు. డాటా ద్వారా సంక్షేమ కార్యక్రమాలను సమర్థంగా అమలు చేసేందుకు వినియోగిస్తామని తెలిపారు. సర్వే నివేదికపై 4న మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదం తీసుకుంటామని, అదే రోజు అసెంబ్లీలో చర్చకు పెడతామని వెల్లడించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ఈ సర్వే తెలంగాణ చరిత్రలో ఓ స్వర్ణాధ్యాయమన్నారు. మంత్రి దామోదర రాజ నరసింహ మాట్లాడుతూ సామాజిక న్యాయాన్ని నిర్ధారించడంలో నిబద్ధతతో కూడిన ప్రయత్నమే ఈ సర్వే అని వ్యాఖ్యానించారు. సీతక్క మాట్లాడుతూ ఇలాంటి సర్వేలు దేశవ్యాప్తంగా నిర్వహించాల్సిన అవసరముందన్నారు.

ప్రణాళికశాఖ నివేదించిన ఇంటింటి సర్వే (కులగణన) వివరాలు

వర్గం	జనాభా	శాతం
బీసీ	1,64,09,179	46.25%
బీసీ ముస్లింలు	35,76,588	10.08%
ఎస్సీలు	61,84,319	17.43%
ఎస్టీలు	37,05,929	10.45%
ఓసీ ముస్లింలు	8,80,424	2.48%
ఇతర ఓసీలు	47,21,115	13.31%

4న అసెంబ్లీలో చర్చ

సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గ సమావేశం 4న ఉదయం 10 గంటలకు కొనసాగనుంది. అదేరోజున ఉదయం 11 గంటలకు అసెంబ్లీ ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సారథ్యంలోని క్యాబినెట్ సబ్ కమిటీకి ప్రణాళికా విభాగం సమర్పించిన సమగ్ర ఇంటింటి కులగణన సర్వే నివేదికపై మంత్రి వర్గ సమావేశంలో చర్చిస్తారు. నేడు ఎస్సీ ఉప కులాల వర్గీకరణపై డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని ఏకసభ్య న్యాయకమిషన్ తమ నివేదికను క్యాబినెట్ సబ్ కమిటీకి అందించనున్నది.

సర్వే నివేదిక తప్పుల తడక

మొదటిపేజీ తరువాయి...

వ్యక్తంచేస్తున్నారు. సర్వే చేయాల్సిన ఇండ్లను గుర్తించి, స్టిక్కర్లు వేశారు. ఈ క్రమంలోనే అనేక మంది గృహ యజమానులు విముఖత చూపారు. స్టిక్కరింగ్ చేసేందుకు అంగీకరించలేదు. దీంతో ఎన్యుమరేటర్లు సైతం చేసేదేమీలేక ఆయా ఇండ్లను మినహాయించారు. ప్రభుత్వం సైతం 1.03 లక్షల ఇండ్లు తలుపులు వేసి ఉండడం, 1.68 లక్షల కుటుంబాలు సర్వేలో పాల్గొనడానికి సంకోచించడం, 84,137 ఇండ్లు నివాసేతరంగా ఉండటం వంటి సమస్యలతో 3.1 లక్షల కుటుంబాల వివరాలను, మొత్తంగా 16 లక్షల జనాభా వివరాలను సేకరించలేదని తాజాగా ప్రకటించింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఇండ్లను ఇదే రీతిలో మినహాయించారని సామాజికవేత్తలు వెల్లడిస్తున్నారు. స్టిక్కరింగ్ చేసిన ఇండ్లకు సంబంధించిన సమాచారాన్ని సమగ్రంగా సేకరించలేదని చెప్తున్నారు. ఇక పట్టణాల్లోనైతే పరిస్థితి మరీ దారుణంగా ఉందని, స్లమ్ ఏరియాలు మినహా మిగతా ప్రాంతాల్లో సర్వే 30 శాతానికి మించి కొనసాగలేదని, అర్బన్‌లో అనేక మంది గృహ యజమానులు స్టిక్కరింగ్‌కే అంగీకరించలేదని, చేయించుకున్నవారు కూడా వివరాలను వెల్లడించేందుకు ముందుకురాలేదని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షల సంఖ్యలో ఇండ్లు సర్వేలో లేకుండానే పోయాయని ఘంటాపథంగా చెప్తున్నారు. ప్రజలందరి వివరాలను సేకరించే ప్రయత్నం చేయకుండానే 96.9 శాతం సర్వే నిర్వహించామని చెప్తూ గణాంకాలను వెల్లడించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేస్తున్నారు.

అరకొరగానే సమాచార సేకరణ

కచ్చితమైన లెక్కలు తీయాలంటే ఇప్పటికే అందుబాటులో ఉన్న గణాంకాలతో క్షేత్రస్థాయిలో తులనాత్మక అధ్యయనం చేయాల్సి ఉంటుందని, అదే సమయంలో కొత్త కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేస్తే సరిపోయేదని బీసీ మేధావులు వివరిస్తున్నారు. ప్రభుత్వం అందుకువిరుద్ధంగా ఇంటింటి సర్వే చేసిందని వెల్లడిస్తున్నారు. గృహ యజమానులు చెప్పిన సమాచారాన్నే ఎన్యుమరేటర్లు నమోదు చేశారని, అది వాస్తవమా? కాదా? అన్న పరిశీలనకు ఎక్కడా అవకాశం లేకుండా పోయిందని వివరిస్తున్నారు. కులాలవారీగా వెల్లడించిన లెక్కలపై అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. సర్వేలో పాల్గొన్నవారిలో చాలా మంది గృహ యజమానులు ఆస్తులు, ఆదాయ వివరాలను వెల్లడించేందుకు విముఖత చూపారని, వెరసి అరకొరగానే సమాచారం సేకరించారని వివరిస్తున్నారు. కొన్ని ఇండ్లను గణించి, కొన్నింటిని గణించకపోవడం, కొందరి వివరాలు సేకరించి, చాలామందిని వదిలేయడం వల్ల సమగ్ర సర్వే ఎలా అవుతుందని ప్రశ్నిస్తున్నారు. అరకొరగా సేకరించిన సమాచారాన్ని క్రోడీకరించి రూపొందించే గణాంకాలు క్షేత్రస్థాయి పరిస్థితులను ప్రతిబింబించబోవని స్పష్టం చేస్తున్నారు. సేకరించిన డాటా కచ్చితత్వం, ప్రామాణికతపై తీవ్ర ప్రభావం చూపుతుందని హెచ్చరిస్తున్నారు. మొత్తంగా సర్వే ఉద్దేశం నెరవేరడమే ప్రశ్నార్థకంగా మారుతుందని చెప్తున్నారు. బీసీ రిజర్వేషన్ల స్థిరీకరణ, ఇంటింటి సర్వేపై రేవంత్ సర్కారు ఆది నుంచీ ఇష్టానుసారంగా వ్యవహరించిందని, ఏమాత్రం చిత్తశుద్ధి లేకుండా ముందుకు పోయిందని నిప్పులు చెరుగుతున్నారు.

ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలి: బీసీ కుల సంఘాల ఐక్యవేదిక

నగరంలో 40 శాతం కూడా కుల సర్వే సమగ్రంగా జరగలేదని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు మండిపడ్డారు. అసమగ్రంగా సేకరించిన సమాచారంతో జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను ఖరారు చేస్తే, తక్కువ సీట్లు వచ్చే ప్రమాదముందని తెలిపారు. వెంటనే నగరంలో పూర్తిస్థాయి సామాజిక కుల సర్వే చేపట్టాలని, అందుకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది దాటినా కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ముందుకు రాకపోవడంపై నిప్పులు చెరిగారు. ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వం బీసీలను నిర్లక్ష్యం చేస్తున్నదని విమర్శించారు.

తొందరపాటు చర్యలు మానుకోవాలి: జాజుల

రాష్ట్ర ప్రభుత్వం తొందరపాటు చర్యలను మానుకోవాలని, బీసీ సంఘాలు, మేధావులతో సీఎం రేవంత్ సమావేశం ఏర్పాటు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. రేవంత్‌కు బహిరంగ లేఖ విడుదల చేశారు. కులగణన లెక్కలను కమిషన్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని, ఇప్పుడు మంత్రివర్గ ఉప సంఘం అంటూ హడావుడి చేస్తూ గందరగోళ పరిస్థితి కల్పిస్తున్నదని మండిపడ్డారు. తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని, న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలని సూచించారు. అఖిలపక్ష నేతలతో తక్షణమే ఉన్నత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడికి దేహశుద్ధి

- విద్యార్థినితో అసభ్యకర ప్రవర్తన
- ఆలస్యంగా వెలుగులోకి

నర్సాపూర్ (జీ), ఫిబ్రవరి 2 : విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ గురువు విద్యార్థినులపై అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నిర్మల్ జిల్లా నర్సాపూర్(జీ)లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓ ఉపాధ్యాయుడు ఓ విద్యార్థినితో నాలుగు రోజుల క్రితం అసభ్యంగా ప్రవర్తించాడు. విద్యార్థిని శనివారం తల్లిదండ్రులకు విషయం వివరించడంతో పాఠశాలకు వచ్చి సదరు ఉపాధ్యాయుడికి దేహశుద్ధి చేశారు. సదరు ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని విద్యార్థిని తల్లిదండ్రులు డీఈవోను కోరారు.

వృద్ధుడిపై పోక్సో కేసు

బయ్యారం, ఫిబ్రవరి 2 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం కొత్తపేట ఎస్సీ కాలనీకి చెందిన చెన్నయ్య చిన్నారులతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో గమనించిన స్థానికులు శనివారం రాత్రి దేహశుద్ధి చేశారు. పోలీసులకు సమాచారం ఇవ్వగా, వారు వృద్ధుడిని అదుపులోకి తీసుకున్నారు. పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్సై తిరుపతి తెలిపారు.

ఎన్నికల వేళ రాష్ట్ర అధ్యక్ష పదవి ఖాళీయా?

- లేఖాస్త్రాన్ని సంధించిన పీఆర్టీయూ టీఎస్ జిల్లా నేతలు

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ) : కీలకమైన ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతున్న తరుణంలో పీఆర్టీయూ టీఎస్‌లో అదే సంఘానికి చెందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు రాసిన లేఖ సంచలనంగా మారింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డికి జనవరి 29న రాసిన లేఖ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నది. పీఆర్టీయూ టీఎస్ అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచి టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఎన్నికల్లో పోటీచేస్తుండడంతో శ్రీపాల్‌రెడ్డి 2024 డిసెంబర్ 31న స్వచ్ఛంద పదవీ విరమణ పొందారు. సంఘం నియామళి ప్రకారం టీచర్ ఉద్యోగంలో ఉన్నవారే పదవిలో ఉన్నట్టు లెక్క. దీంతో రాష్ట్ర అధ్యక్ష పదవి ఖాళీ అయినట్టే. కానీ ఇంత వరకు కొత్త అధ్యక్షుడిని నియమించలేదు. ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు లేఖ సంధించారు.

కాంగ్రెస్ కమాండ్ సెంటర్?

- రాజకీయాలకు అడ్డాగా పోలీస్ కమాండ్ సెంటర్
- సర్కారు సమీక్షలు, రాజకీయ మీటింగులు అందులోనే
- నెలలో మూడ్రోజులు సమీక్షలు, సమావేశాలు
- సచివాలయానికే స్వస్తి చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి?
- వాస్తుభయంతో మార్పులు చేయించినా నో ఎంట్రీ



కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం, మంత్రులతో కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 2 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ నడిబొడ్డున గత ప్రభుత్వ హయాంలో శత్రు దుర్భేధ్యంగా, అత్యాధునిక వసతులతో నిర్మించిన పోలీస్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) రాజకీయ సమీక్షలకు అడ్డాగా మారిందా? నిన్న మొన్నటి వరకూ కేసీఆర్, సచివాయంపై సూక్తులు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వాస్తు భయంతో అటువైపు కన్నెత్